
సాక్షి
కాకినాడ

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500,పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.



పోలీసు వలయంలో అమలాపురం

అమలాపురంలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. - 8లో▸

శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు

కొత్తపేట: శని దోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి క్షేత్రంలో శ్రీ ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.81,817, అన్నప్రసాదం విరాళాలుగా రూ.10,991 చొప్పున ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ప్రాధాన్య పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రభుత్వం ప్రాధాన్య అంశాలుగా తీసుకున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలసి హాజరయ్యారు. రీ సర్వే, మార్కెఫెడ్ గోదాములకు అవసరమైన భూసేకరణ, పీఎం కిసాన్ కేవైసీ, ఈ–క్రాప్ బుకింగ్, జగనన్న పాలవెల్లువ, లే అవుట్ పనులు తదితర కార్యక్రమాలపై సీఎస్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మిగిలిన లే అవుట్లలో లెవెలింగ్, స్టోన్ ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం సంబంధించి జిల్లాలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ వంటి ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాల్లో పురోగతి చూపాలన్నారు. అలాగే జిల్లాలో ఇంకా సాగు చేయని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఒకే అంశంపై అర్జీలు రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీపీవో పి.త్రినాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామ శివారున రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 26 మంది గాయపడ్డారు. వివరాలివీ.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న పల్లె వెలుగు బస్సును.. కొవ్వూరు నుంచి ఏలూరు వెళ్తు మరో పల్లె వెలుగు బస్సు ఢీకొంది. లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో రెండు బస్సుల ముందు భాగాలూ దెబ్బతిన్నాయి. ప్రమాదానికి గురైన రెండు బస్సులూ కొవ్వూరు డిపోకు చెందినవే. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన 18 మందికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు పంపించారు. మరో ముగ్గురికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిలో ఐదుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో లారీ ముందు వెళ్తున్న మోటార్ సైక్లిస్టు బస్సు ముందు చక్రంలో పడిపోయారు. అయితే, అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆయన మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయ్యింది. హైవే పెట్రోలింగ్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధర్ ఆధ్వర్యాన క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి వనిత


ఈ ప్రమాదంపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్పందించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ, పోలీసులు అధికారులను ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోయినప్పటికీ 26 మంది గాయపడటం దురదృష్టకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

మది నిండా మహానేత

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళి
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు
- దివంగత నేత అభివృద్ధి కార్యక్రమాలు మననం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు



కాకినాడ: వైఎస్సార్.. వైఎస్సార్.. వైఎస్సార్.. జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా ఆయన జ్ఞాపకాలను తలచుకుంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు ఆయననే స్మరించారు. మహానేత మరణించి 14 ఏళ్లు గడచినప్పటికీ ఆయన స్మృతులు ఎప్పటికీ పదిలంగానే ఉన్నాయని ప్రజలు మరోసారి నిరూపించారు. ప్రజల నుంచి ఆయన దూరమైనప్పటికీ అమలు చేసిన పథకాలు, పంచిన ఆత్మీయతను జ్ఞప్తికి తెచ్చుకుంటూ శనివారం వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. అనేక చోట్ల వైఎస్సార్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- జిల్లా కేంద్రం కాకినాడలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బాలాజీచెరువు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు.
- పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలోని పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.
- ప్రత్తిపాడు, ఒమ్మంగిలోని వైఎస్ విగ్రహాలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంచారు.
- పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు పండ్లు, రొట్టెలు అందజేశారు. సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలో విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.
- తుని శ్రీరామ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- జగ్గంపేట నియోజకవర్గంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని, చేసిన అభివృద్ధిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు.



ఒమ్మంగిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

రైల్వే స్టేషన్లను తనిఖీ చేసిన డీఆర్‌ఎం



సామర్లకోటలో సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌ఎం పాటిల్

సామర్లకోట: రైల్వే ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ అన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శనివారం ప్రత్యేక రైలులో సామర్లకోట వచ్చిన ఆయన స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం కాకినాడ పోర్టులో తనిఖీలు చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, అన్నవరం రైల్వే స్టేషన్లను కూడా తనిఖీ చేశారు. సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే భద్రతపై గ్యాంగ్‌మన్ నుంచి ఇంజినీరింగ్ అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించడానికి రైల్వే అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రైల్వే స్టేషన్ పరిధిలో పారిశుధ్య లోపం గుర్తించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆయనకు వివరించారు. అదనపు సిబ్బందిని కేటాయించాలని కోరారు. అనంతరం సిగ్నల్ వ్యవస్థ, ప్రయాణికుల విశ్రాంతి గదులు, టిక్కెట్ కౌంటర్లు, పార్శిల్ కార్యాలయం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట విజయవాడ రైల్వే సీనియర్ డీఓఎం డి.నరేంద్రవర్మ, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, సీనియర్ డీఈ కె.శ్రీనివాసరావు, సీనియర్ డీఈఎన్ రవికుమార్ సుమ్మి, స్థానిక స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఏడీఈఎన్ బి. శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రవికాంత్, రామ సుబ్బారావు, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు, సంతోష్‌కుమార్, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు కిశోర్, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్య భద్రత



ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, చిత్రంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా



ఫోర్టిఫైడ్ ముడి బియ్యంతో తయారు చేసిన వంటకాలు రుచి చూస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

- వంటల పోటీలను ప్రారంభించిన ఎంపీ వంగా గీత
- పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా బృందాలు

కాకినాడ సిటీ: ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాహార బియ్యం)తో ప్రజలకు ఆరోగ్యభద్రత లభిస్తుందని ఎంపీ వంగా గీత అన్నారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో శనివారం పౌరసరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఫోర్టిఫైడ్ బియ్యంతో వంటల పోటీలను కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, పౌరసరఫరాల సంస్థ డీఎం పుష్పమణి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీ ప్రారంభించారు. 30 మహిళా బృందాలు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉపయోగించి తయారు చేసిన వివిధ రకాల వంటలను పరిశీలించి రుచి చూశారు. ఫోర్టిఫైడ్ రైస్ పకోడీ, ఫోర్టిఫైడ్ రైస్ నూక బిర్యానీ, లడ్డూలు, గారెలు, సూప్, కిచిడీ, వడియాలు తదితర వంటకాలను తయారు చేసిన మహిళలను అభినందించారు.

ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా బియ్యం కార్డుదారులందరికీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బలవర్ధక బియ్యంలో ఉండే ఐరన్ రక్తహీనత నివారణకు, బీ12 నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఫోలిక్ యాసిడ్ గర్భస్థ శిశు వికాసానికి ఉపయోగపడుతుందన్నారు. అపోహలను వీడి కుటుంబంలోని అందరూ ఫోర్టిఫైడ్ బియ్యం వంటకాల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

అపోహలు తొలగించి అవగాహన

ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహలు తొలగించి దాని ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రతి మండలం నుంచి మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా 2019 నవంబర్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తోందన్నారు. గత జూలై నుంచి కాకినాడ జిల్లాలో 6.54 లక్షల కుటుంబాలకు చెందిన 18,53,250 మంది లబ్ధిదారులకు రేషన్ డిపోల ద్వారా పోషక విలువలున్న బియ్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. పౌర సరఫరాల సంస్థ డీఎం డి.పుష్పమణి, కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను సత్కరించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద తదితరులు హాజరయ్యారు.

విజేతలకు బహుమతులు

వంటకాల పోటీల్లో విజేతలకు కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కె.పద్మశ్రీ, జేసీ ఎస్.ఇలక్కియ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ జి.నాగమణి నగదు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.10 వేలు పెదపూడికి చెందిన కె.శ్రావణి, బి.రమ్య తయారు చేసిన గంజి సూప్‌కి లభించింది. ద్వితీయ బహుమతి రూ.5 వేలు జగ్గంపేటకు చెందిన వై.నాగమణి, వై.వరలక్ష్మి తయారు చేసిన స్నాక్ ఐటమ్‌కి, తృతీయ బహుమతి రూ. 3 వేలు తాళ్లరేవుకు చెందిన బి.శ్రీమహాలక్ష్మి, బి మేఘనశ్రీ తయారు చేసిన ఇడియప్పంకు లభించింది. పోటీల్లో పాల్గొన్న 30 బృందాలకు రూ.500 చొప్పున రూ.15 వేలు ప్రోత్సాహకంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అందజేశారు.



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న నవదంపతులు, భక్తులు

రత్నగిరిపై మోగిన పెళ్లి బాజా

- నవదంపతులు, భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- సత్యదేవుని దర్శించిన 40 వేల భక్తులు
- నేడు, రేపూ కూడా కొనసాగనున్న పెళ్లిసందడి

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన పెళ్లిబృందాలు, భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు వంద వివాహాలు జరిగాయి. ఈ వివాహాలు చేసుకున్న నవ దంపతులు, బంధుమిత్రులతో పాటు ఇతర ప్రాంతాల్లో పెళ్లి చేసుకున్న జంటలు కూడా సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి సాధరణ భక్తులు కూడా ఎక్కువ సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రాక కొనసాగింది. నవ దంపతులతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సందడి నెలకొంది. సత్యదేవుని ఆలయాన్ని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు, రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతుల వెలిగించారు. నవదంపతులు స్వామివారి దర్శనం అనంతరం తమ పెళ్లిదండలను రావి చెట్టు వద్ద గల గ్రిల్స్‌కు వేలాడదీశారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దేవస్థానంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆది, సోమవారాలలో కూడా రత్నగిరిపై వివాహాలు పెద్ద సంఖ్యలో జరిగే అవకాశం ఉంది. దేవస్థానంలో రద్దీ నెలకొనే అవకాశం ఉంది. దేవస్థానం సత్రాల గదులలో అధిక శాతం వివాహ బృందాల వారు రిజర్వ్ చేసుకున్నారు. ఈ రెండు రోజులు సత్రాలలో గదులు లభించే అవకాశం తక్కువ. భక్తులు పరిస్థితిని గమనించి సహకరించాలని అధికారులు కోరారు.



విశ్రాంతి మండపంలో వివాహ మండపాలు



నవదంపతుల పెళ్లిదండలతో నిండిపోయిన గ్రిల్స్

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కాకినాడ క్రైం: సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారి పడి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ పర్లోవపేటకు చెందిన చింతపల్లి రాజు (49) గత నెల 29న తన బోటులో కుమారుడు సింహాద్రితో పాటు మరో మత్స్యకారుడు ఎల్లాజీతో కలిసి కుంభాభిషేకం రేవు నుంచి వేటకు వెళ్లాడు. ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో హోప్ ఐలాండ్ వద్ద చేపలు వేటాడుతున్నారు. ఈ క్రమంలో రాజు ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారి సముద్రంలో పడిపోయాడు. అప్పటికే చేపల వేట కోసం వేసిన వలలో చిక్కుకున్నాడు. ప్రాణ రక్షణ కోసం కేకలు వేయడంతో గమనించిన తోటి మత్స్యకారులు వలను బోటు పైకి లాగి, రాజును రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే అచేతన స్థితిలో ఉన్న రాజును సింహాద్రి, ఎల్లాజీ కలిసి, కుంభాభిషేకం తీరానికి తీసుకువచ్చారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని, పరీక్షించగా రాజు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య నూకరత్నం ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

జేఎన్‌టీయూకే పాలక మండలి నియామకం

- సభ్యులను నియమించిన ప్రభుత్వం
- మూడేళ్ల పాటు కొనసాగింపు
- ఐదుగురు మహిళలకు అవకాశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాలపరిమితి ముగిసిన యూనివర్సిటీలకు పాలక మండలి సభ్యులను నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూకే పాలక మండలిని మూడేళ్ల కాలపరిమితితో 2020 మార్చిలో ఏర్పాటు చేయగా దాని గడువు గత మార్చితో ముగిసింది. అనంతరం రెండు నెలలు పొడిగించారు. తాజాగా సెప్టెంబర్ 1 నుంచి మూడేళ్ల కాలపరిమితితో కొత్త పాలక మండలి సభ్యులను నియమించారు. వీరిలో వర్సిటీ నుంచి వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, ఇద్దరు ప్రొఫెసర్లు ఉన్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఆర్థిక కార్యదర్శి, సాంకేతిక కమిషనర్ కూడా ఉండగా, మిగిలిన సభ్యులుగా విద్య, వ్యాపారం తదితర రంగాల్లో నిష్ణాతులైన వారిని నియమించారు. వర్సిటీ అభివృద్ధితో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఎనిమిది జిల్లాల్లోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రగతికి సంబంధించి ఈ పాలక మండలి నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ నెల నాలుగో వారంలో నూతన పాలక మండలి తొలి సమావేశం ఏర్పాటు చేసి, వివిధ అంశాలపై సమీక్షిస్తామని జేఎన్‌టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు.



జేఎన్‌టీయూ-కాకినాడ

కొత్త పాలకవర్గ సభ్యులు వీరే..

వర్సిటీ తరఫున చైర్మన్ హోదాలో వీసీ ప్రసాదరాజు వ్యవహరిస్తారు. సభ్యులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీనియర్ ప్రొఫెసర్ కోటాలో యూవీ రత్నకుమారి (ఈసీఈ), డాక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ (జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్), ప్రొఫెసర్ హరిత (సీఎస్ఈ ప్రొఫెసర్), డాక్టర్ ఎస్‌కే అమినాబీ (వీవీ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్, గుడ్లవల్లేరు కళాశాల, కృష్ణా జిల్లా), నిష్ణాతుల కోటాలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, రిలయన్స్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ బి.మల్లికార్జునరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌లను నియమించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాకినాడ క్రైం: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఎస్సై ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. కాకినాడ వైఎస్సార్ వంతెన కింద ఉన్న రైల్వే ట్రాక్‌పై శుక్రవారం అర్ధరాత్రి సుమారు 30 ఏళ్ల వ్యక్తిని రైలు ఢీకొంది. అతడి వివరాలు తెలియరాలేదు. 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయలో ఉన్న ఆ వ్యక్తి మోచేయి ముందు భాగాన పుట్టమచ్చ, ఎడమ భుజంపై సూర్యుడి పచ్చబొట్టు ఉన్నాయి. మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్ మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీని నేరుగా లేదా 94407 02328 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్సై సూచించారు.

మల్టీ లెవెల్ పార్కింగ్‌తో మేలు

అన్నవరం: భక్తుల వాహనాలు నిలిపేందుకు అన్నవరం దేవస్థానంలో సత్యగిరి దిగువన ఏర్పాటు చేసిన మల్టీ లెవెల్ పార్కింగ్ దేవస్థానానికి ఎంతో ఉపయోగపడుతోంది. వివాహాల సీజన్ కారణంగా వందలాది వాహనాల్లో పెళ్లిబృందాల వారు, భక్తులు దేవస్థానానికి శనివారం వచ్చారు. వీరి వాహనాలను నిలపడానికి దేవస్థానంలో పార్కింగ్ స్థలం చాలలేదు. దీంతో, వాటిని మల్టీలెవెల్ పార్కింగ్‌లో నిలిపివేశారు. సుమారు 200 కార్లను ఇక్కడ నిలిపారు. సుమారు 600 కార్లు నిలిపేందుకు వీలుగా ఇక్కడ స్థలాన్ని చదును చేయించామని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. త్వరలోనే ఈ మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రదేశాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా, వందలాది వాహనాల్లో రత్నగిరికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఒకేసారి కొండ దిగువకు బయలుదేరారు. దీంతో రెండో ఘాట్ రోడ్డులో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సెక్యూరిటీ సిబ్బంది సకాలంలో ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.


సత్యగిరి పక్కన మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలంలో నిలిపిన కార్లు

పోలీసు వలయంలో అమలాపురం

- రౌడీషీటర్ హత్య, తదనంతర పరిణామాలతో అప్రమత్తం
- 15 చోట్ల పికెట్లు
- డీఐజీ, ఇద్దరు ఎస్పీలతో శాంతిభద్రతల పరిరక్షణ
- నిందితుల వేటలో పోలీసు ప్రత్యేక బృందాలు


అమలాపురం పట్టణంలో మోహరించిన పోలీసులు

అమలాపురం టౌన్: రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్య, అతడి స్నేహితుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా శుక్రవారం అర్ధరాత్రి నుంచే భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంతో పాటు ఈదరపల్లి ప్రాంతాలు శనివారం పూర్తిగా పోలీసు వలయంలోకి వెళ్లాయి. అడుగడుగునా పోలీసు పహరాలు, పికెట్లు ఏర్పాటు చేశారు. దాదాపు 400 మంది పోలీసులను మోహరించారు. అమలాపురంలోని టీడీపీ నాయకుడు, మాజీ రౌడీషీటర్ గంధం పల్లంరాజు ఇంటి వద్ద, అతడి షాపు ఉన్న సప్తగిరి అపార్ట్‌మెంట్, కొంకాపల్లిలోని రౌడీషీటర్ ఆనంద్ ఇంటి వద్ద, అల్లవరం మండలం గూడాలలోని సుధీర్ ఇంటి వద్ద, ఈదరపల్లిలోని ఇద్దరి రౌడీ గ్యాంగ్ ఇళ్ల వద్ద, అమలాపురంలోని ముఖ్య కూడళ్లు కలిపి మొత్తం 15 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అమలాపురంలో అల్లర్లకు అర్ధరాత్రి నుంచే పోలీసులు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్, కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్ విజయారావు ఆధ్వర్యాన పోలీసు పహరా కొనసాగుతోంది. రౌడీషీటర్ల ఆగడాలు, శాంతిభద్రతల పరిస్థితిపై పోలీసు ఉన్నతాధికారులు ఎస్పీ కార్యాలయంలో శనివారం పలుమార్లు సమీక్షించారు. ఇక నుంచి రౌడీషీటర్లపై మరింతగా ఉక్కుపాదం మోపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీధర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పోలీసు బందోబస్తుకు పలు సూచనలు ఇచ్చారు. కిషోర్‌ను హత్య చేయడంతో పాటు సాయిలక్ష్మణ్‌పై హత్యాయత్నానికి పాల్పడి, పరారైన రౌడీ గ్యాంగ్ కోసం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యాన రెండు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఇప్పటికే కొంతమంది అనుమానితులను, రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదు

జిల్లా ఎస్పీ శ్రీధర్



రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదని, వారి కదలికలపై ఇక నుంచి నిరంతర నిఘా పెడతామని, మరింతగా ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం కేసులను లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్ల మూలాల్లోకి వెళ్లి విచారిస్తున్నామని చెప్పారు. ఈ హత్య, తదితర పరిణామలపై సోషల్ మీడియా ద్వారా ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రత పరిరక్షణకు అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో నిందితులందరినీ త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ శ్రీధర్ చెప్పారు.

కారు ఢీకొని 20 గొర్రెల మృతి

గోపాలపురం: కారు ఢీకొని 25 గొర్రెలు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గోపాలపురం గ్రామానికి చెందిన గంధం శ్రీను తన గొర్రెల మందను గొల్లగూడెం నుంచి గోపాలపురం తోలుకు వస్తున్నాడు. గోపాలపురం పొగాకు బోర్డు సమీపానికి వచ్చేసరికి దేవరపల్లి నుంచి గోపాలపురం వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి మందను ఢీకొట్టింది. ఈ సంఘటనలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 5 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. అవి కూడా చనిపోతాయని గంధం శ్రీను కన్నీటిపర్యంతమయ్యాడు. చనిపోయిన 20 గొర్రెల్లో 10 గొర్రెల గర్భంలో ఉన్న పిల్లలు కూడా చనిపోయాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పాడు. సంఘటన స్థలంలో లభ్యమైన నంబర్ ప్లేటు, బంపర్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై కె.శోభనాద్రి తెలిపారు.